
సాక్షి
బాపట్ల

సోమవారం । 27 । జనవరి । 2025



గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: పట్టణంలోని సాక్షి భావన్నారాయణస్వామి దేవస్థానంలో అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రీ దీప మహా యజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 555.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,567 క్యూసెక్కులు వదిలారు.



కలశాలతో శోభాయాత్ర

పిడుగురాళ్ల: ప్రసన్నాంజనేయస్వామివారి మూల విరాట్‌కు ఆదివారం అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఐజీ కార్యాలయంలో జెండా వందనం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. జాతీయ జెండాను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎగురవేశారు. గుంటూరు ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, సీసీ రాఘవ, సీఐ ఆరోగ్యరాజు, ఐజీ, జిల్లా ఎస్పీ కార్యాలయాల ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..



నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. జాతీయ జెండాను ఎస్పీ సతీష్‌కుమార్ ఎగురవేసి జెండా వందనం చేశారు. ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), కార్యాలయ ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), ఏడుకొండలురెడ్డి (ఏఆర్), సిబ్బంది పాల్గొన్నారు.


ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరులో తాత్కాలిక హాల్టింగ్

రైల్వేస్టేషన్(విజయవాడసెంట్రల్): గుంటూరులోని కాజలో జరుగుతున్న బైబిల్ మిషన్ సదస్సుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరు స్టేషన్‌లో రెండు నిమిషాల పాటు తాత్కాలింగా హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి 29 వరకు నర్సాపూర్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17281), సికింద్రాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (17015) రైళ్లు నంబూరు స్టేషన్‌లో ఆగనున్నాయి. బైబిల్ మిషన్ వార్షిక సదస్సు కోసం వేలాదిగా తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కాకినాడ టౌన్-గుంటూరు మధ్య ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ రైలును (ప్యాసింజర్) నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాకినాడ టౌన్-గుంటూరు ప్రత్యేక రైలు (07223) ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07224) ఈ నెల 29న మధ్యాహ్నం 1.30 గంటలకు గుంటూరులో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.40 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. వయా నిడదవోలు, ఏలూరు మీదుగా నడిచే ఈ రైలుకు అన్ని స్టేషన్లలో ఒక నిమిషం పాటు హాల్టింగ్ కల్పించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

తెనాలిరూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కొడాలి చంద్రకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చిన అతను కనబడకుండా పోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 100 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 239 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 180 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 600 క్యూసెక్కులు నీటిని వదిలారు.



జాతీయ జెండాను తీసుకువస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు





సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు



గణతంత్ర స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- 76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వెంకట మురళి
- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి
- స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వైభవంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించి వందన సమర్పణ
- పోలీసు గౌరవ వందనం స్వీకరణ
- ఆలరించిన వివిధ శాఖల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అందరికీ సంతృప్తి కలిగే రీతిలో ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు కలెక్టర్ వెంకట మురళి జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పోలీసు కవాతును తిలకించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసులు సాహస విన్యాసాలు అలరించాయి. కలెక్టర్ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసులను శాలువలు, పుష్పమాలలతో ప్రత్యేకంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. వేడుకలు నిర్వహించిన పోలీస్ కవాతు మైదాన ప్రాంతమంతా జాతీయ జెండాలతో కళకళలాడింది. డ్రోన్ ద్వారా జాతీయ పతాకం గగనతలంలో ఆవిష్కరించేలా అధికారులు ఏర్పాటు చేశారు. ప్రగతిని చాటుతూ వివిధ శాఖలు రూపొందించిన శకటాల ప్రదర్శన ప్రజలకు కనువిందు చేశాయి. ప్రజలకు అవగాహన కల్పించేలా శకటాల ముందు వైపు అధికారులు విస్తృతమైన ప్రచారాలతో ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కలెక్టర్ వివరించారు. ఆయన మాటల్లో...

వ్యవసాయానికి ఊతం

2024-25 సంవత్సరంలో జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2.67 లక్షల ఎకరాల్లో సాగైన వివిధ పంటలను ఈ-క్రాప్ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ 5,436 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీ కింద అందజేశారు. 173 గ్రామ పంచాయతీల పరిధిలో 58,767 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతుల లబ్ధి కోసం జిల్లాలో 1,06,670మంది లక్ష్యానికి గాను ఇప్పటివరకు 88 వేల మందికి సాగుదారు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉద్యాన పంటల అభివృద్ధి కోసం రూ. 13.89 కోట్లతో షెడ్లు, నెట్స్, పాలీహౌస్‌లు నిర్మించారు. మైక్రో ఇరిగేషన్ కింద 1,087 మందికి 870.17 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ ఇచ్చారు.

మత్స్యకారులకు భరోసా

10,050 మందిని మత్స్యకార భరోసాకు ఎంపిక చేశారు. 4,602 మంది మత్స్యకార మహిళలకు నెలకు 2,750 పింఛన్ ఇస్తున్నారు. జిల్లాలో రూ. 902 కోట్లతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఫేజ్-11 పనులు 60 శాతం పూర్తయ్యాయి.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

జిల్లాలోని 1,403 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 వ తరగతి వరకు 83,247 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. 15 జూనియర్ కళాశాల్లో 1,971 మందికి వారానికి ఐదు రోజులు గుడ్లు, రాగిమాల్ట్, ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

ఖరీఫ్‌లో 17 మండలాలకు 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 78 చెరువులకు తాగునీరు అందించారు. సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా 455 గ్రామ పంచాయతీల పరిధిలో 5,083 చేతిపంపుల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. 2027 నాటికి జిల్లాలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నది లక్ష్యం. మనిషికి రోజుకు 55 లీటర్ల చొప్పున నీటిని అందించేందుకు రూ. 588 కోట్లతో 1420 పనులను మంజూరు చేశారు. అమృతధార పథకం ద్వారా 3,56,000 ఇళ్లకు గాను ఇప్పటివరకు 1,48,000 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు.

మరుగుదొడ్ల సౌకర్యం

జిల్లాలో 3,56,417 ఇళ్లకు గాను ఇప్పటి వరకు 3,14,000 వేల ఇళ్లకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

294 మొబైల్ వాహనాల ద్వారా 4,86,151 మంది రైస్ కార్డుదారులకు ప్రతినెలా 7,089 మెట్రిక్ టన్నుల రైస్, 243 మెట్రిక్ టన్నుల చక్కెర, 486 టన్నుల కందిపప్పు ఇంటివద్దనే అందిస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకం ద్వారా చేపట్టిన దీపం కింద 3.56 లక్షల మందికి గాను 2.69 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. రూ. 21.53 కోట్ల సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

రైతులకు సేవలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 150 రైతు సేవా కేంద్రాల ద్వారా 8, 050 మంది రైతుల నుంచి 51 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించారు. వారి ఖాతాల్లో రూ. 117.58 కోట్లను జమ చేశారు.

ఉపాధి పథకం ద్వారా పని దినాలు కల్పన

జిల్లాలో 458 గ్రామపంచాతీల్లో 2.66 లక్షల మందికి జాబ్ కార్డులు అందజేశారు. 2024-25లో 65 లక్షల పనిదినాలకు గాను 58.25 లక్షలు కల్పించారు. ఇందులో ఎస్సీ కుటుంబాలకు 20.37 లక్షలు, ఎస్టీ కుటుంబాలకు 2.25 లక్షల పనిదినాలు కల్పించారు.

ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల స్టాల్స్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పలు ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళితో పాటు పట్టణ ప్రజలు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఆయా శాఖలు స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వస్తువుల గురించి కలెక్టర్ సమగ్రంగా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన శాఖ స్టాల్‌కు మొదటి బహుమతి, వ్యవసాయ శాఖ స్టాల్‌కు ద్వితీయ బహుమతి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌కు కలిపి తృతీయ బహుమతి లభించింది. సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా శాఖ శకటానికి ప్రథమ బహుమతి

బాపట్ల : విద్యాశాఖ శకటానికి కలెక్టర్ ప్రథమ బహుమతి అందించారు. వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ద్వితీయ బహుమతి, అన్న క్యాంటీన్లతో రూపొందించిన మున్సిపాలిటీ శకటం తృతీయ బహుమతిని సొంతం చేసుకుంది. సారే జహాసే అచ్చా అంటూ నర్సాయపాలెం అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. బేటీ పడావో బేటీ బచావో అంటూ బాలికల సంరక్షణపై ఏపీఆర్ ఎస్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శనతో కలెక్టర్ చేతుల మీదుగా తృతీయ బహుమతి పొందారు. జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను, కృష్ణానది వరద విపత్తులో అవిశ్రాంతంగా పనిచేసిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రశంసాపత్రాలతో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పీ విఠలేశ్వర్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, చీరాల శాసనసభ్యులు ఎం. మాలకొండయ్య, జిల్లా రెవిన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల శకటాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ , ఎస్పీ



గౌరవం వందనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ . ఎస్పీ తుషార్



విద్యుత్ శాఖ శకటం

బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభం



ప్రార్థనల్లో పాల్గొనేందుకు తరలివచ్చిన భక్తులు



ప్రసంగిస్తున్న బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ శామ్యేల్ కిరణ్

పెదకాకాని: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగురోజులపాటు జరగనున్నాయి. రాష్ట్ర నలుమూలలతోపాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత కాకాని స్వస్తిశాల సంగీత బృంద సభ్యులు ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనలను వివరించారు. బైబిల్ మిషన్ సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్ కుమార్, రెవరెండ్ రాజు, రెవరెండ్ పి.ప్రకాష్ ఓనేసం, రెవరెండ్ సత్య ప్రకాష్, రెవరెండ్ డాక్టర్ డేనియల్ దినకర్‌లు దైవ సందేశాలు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మహోత్సవాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పెదకాకాని స్వస్తిశాలకు కూడా భక్తుల తాకిడి పెరిగింది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఆహారం, తాగునీరు అందించారు. సుమారు 50 ఎకరాల్లో విశాలమైన పందిళ్లు ఏర్పాటు చేశారు. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ జె శామ్యేల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.సజీవరావు, గవర్నింగ్ బాడీ సభ్యుల సారథ్యంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.

నేటి షెడ్యూల్ వివరాలు...

బైబిల్ మిషన్ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సోమవారం తెల్లవారుజామున ధ్యానం, క్రైస్తవ కీర్తనల ఆలాపన ఉంటాయి. అనంతరం పాస్టర్లు దైవ సందేశాలు అందిస్తారు.

కల్యాణ వైభోగమే !

- మోగనున్న పెళ్లి బాజాలు
- ఈ ఏడాదిలో మూడు నెలలు మినహా అన్నింటిలో శుభముహూర్తాలు
- కల్యాణ మండపాలకు, భజంత్రీలు, పురోహితులకు డిమాండ్



వేటపాలెం: ఈ ఏడాది అంతా పెళ్లిళ్ల సందడికి మంచి తరుణం. పెళ్లిళ్ల బాజాలు మోగనున్నాయి. మూడు నెలలు మినహా మిగిలిన తొమ్మిది నెలల్లో 104 ముహూర్తాలు ఉండటం విశేషమని పురోహితులు చెబుతున్నారు. ఈ నెల 22వ తేదీ నుంచే పెళ్లిళ్ల ముహూర్తాలు ప్రారంభం కానున్నా, కొందరు 29వ తేదీ అమావాస్య అనంతరం 30 నుంచి ప్రారంభమవుతున్నాయని అంటున్నారు. అయి తే, జూలై, ఆగస్ట్, సెప్టెంబరు మినహా ఈ ఏడాది అన్ని మాసాల్లోనూ ముహూర్తాలు ఉండటం విశేషం. దీంతో జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి నెలకొంది. కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. భజంత్రీలు, పురోహితులకు గిరాకీ పెరిగింది. పెళ్లిళ్ల ఏర్పాట్లకు వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. నగలు, కొత్తవస్త్రాలు, కల్యాణ మండపాలు, భజంత్రీలు, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. నగలు, వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ బిజీగా మారాయి.

ఈ ఏడాది ముహూర్తాలు ఇలా...

ఫిబ్రవరి: 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15
మార్చి : 4, 6, 7, 8, 11, 12, 13, 14,15,21,22,25,26
ఏప్రిల్: 2,3,4,5,7,8,10,11,12,13,14,15,21,22,23,29
మే : 1,2,3,5,6,7,8,10,11,12,14,20,27,28,29,30
జూన్: 3,4,5,6,7,10,11,12
జూలై, ఆగస్టు, సెప్టెంబరు, మూడు నెలలు ముహూర్తాలు లేవు
అక్టోబర్: 14,16,17,18,20,21,22,23,25,30,31
నవంబర్: 7,13,14,18,19,20,21,26,27
డిసెంబర్: 2,4,5,6,15,16,17,18,19,20,23,24,30

ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి.

ఈ ఏడాది పెళ్లిళ్ల మహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. మాఘ మాసంలో మంచి రోజుల ఉండటంతో అత్యధికంగా వివాహాలు జరగనున్నాయి.

–నరసింహమూర్తి, పురోహితులు, వేటపాలెం

కలెక్టర్ బంగ్లాలో తేనీటి విందు

బాపట్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ బంగ్లాలో ఆదివారం రాత్రి తేనీటి విందు జరిగింది. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఇచ్చిన విందులో రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ప్రకాశం జిల్లా గిద్దలూరు శాసన సభ్యులు ఎం. అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విందుకు హాజరైన రాష్ట్ర మంత్రులు, అధికారులు


బాపట్ల ఆర్డీఓ గ్లోరియాకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న కలెక్టర్


అవార్డును అందుకుంటున్న సమాచారశాఖ పౌరసంబంధాల అధికారి కిరణ్‌కుమార్ | ఎస్సీ కార్పొరేషన్ అధికారి రాజా దిబోరా | బీసీ కార్పొరేషన్ అధికారి శివలీల | డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ | ఐలండ్‌పీఆర్ ఏడీ సుభాషిణి | రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు | మున్సిపల్ జిల్లు కలెక్టర్ బాపట్ల ప్రసాద్ | డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషకుమార్ | మైనింగ్ ఏడీ రాజేష్ | విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆంజనేయులు


ఏపీఎంఐపీ పీడీ వెంకట రమణ | చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ | రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి | ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ ఉమాదేవి | సీపీఓ శ్రీనివాసరావు | వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ | ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ | ఐలండ్‌పీఆర్ వీడియోగ్రాఫర్ రవికిరణ్ | ఐలండ్‌పీఆర్ ఫొటోగ్రాఫర్ సతీష్‌చంద్ | కలెక్టర్ సీసీ నాగరాజు | ఎంజయ్‌కుమార్,ఎడ్యుకేషన్ అధికారి

ఉత్తమ సేవలకు పురస్కారాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలు ప్రభుత్వ శాఖల అధికారులకు కలెక్టర్ జె. వెంకట మురళి పురస్కారాలు అందించారు. స్థానిక పోలీస్ పెరేడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో మరింతగా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అవార్డులు బాధ్యలను పెంచుతాయని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను చిత్తశుద్ధితో అందించాలని సూచించారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించాలని చెప్పారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటు పదాలని తెలిపారు -బాపట్ల


ఉత్తమ అవార్డు అందుకుంటున్న జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్


బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు | సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ | చీరాల 1టౌన్ సీఐ శ్రీనివాసరావు | చీరాల డీఎస్పీ మొయిన్ | చీరాల రూరల్ సీఐ శేషగిరి | బాపట్ల పట్టణ సీఐ రాంబాబు


డీసీఆర్‌బీ సీఐ బాలమురళీకృష్ణ | ఇంకొల్లు సీఐ వెంకటరమణ | రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు | రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జునరావు | ఎస్పీ కార్యాలయం ఆర్‌ఐ శ్రీకాంత్ | ఆర్‌ఎస్‌ఐ సుధాకర్ | ఆర్‌ఐ శ్రీనివాసరెడ్డి | ఎస్‌బీ సీఐ నారాయణ | సీసీఎస్ సీఐ ప్రేమయ్య

షటిల్ బాడ్మింటన్ క్రీడాకారుడు నుమేర్‌కు ప్రోత్సాహం

చీరాల రూరల్ : షటిల్ బాడ్మింటన్ క్రీడాకారుడు షేక్ నుమేర్‌కు అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో రూ. 1,15,000 నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించింది. చీరాలకు చెందిన నుమేర్ అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నాడు. ఇంటర్ యూనివర్సిటీ బాడ్మింటన్ చాంపియన్‌గా నిలిచాడు. అనంతరం జూనియర్ విభాగంలో ఇండియా జట్టుకు క్వాలిఫై అయ్యాడు. చైనాలో జరిగిన ప్రపంచ జూనియర్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.


చాంపియన్‌గా కప్పు అందుకున్న నుమేర్

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

అద్దంకి రూరల్: పొలంలో దుక్కి దున్నడానికి గొర్రుతో వెళుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం అద్దంకి - రేణింగవరం రోడ్డులో చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మండలంలోని గుర్రంవానిపాలెం గ్రామానికి చెందిన యలగాల గోపి (27) గొర్రుతో ఉన్న ట్రాక్టర్‌ను తీసుకుని అద్దంకి వైపు వస్తున్నాడు. అదే రోడ్డులో వస్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టటంతో సైడు కాలువలో పడింది. తీవ్ర గాయాలైన ట్రాక్టర్ డ్రైవర్ గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.


ప్రమాద స్థలంలో ట్రాక్టర్

కేంద్ర అవార్డు అందుకున్న సర్పంచ్

యద్దపాడు: ఢిల్లీలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో మండలానికి చెందిన మద్దినీడి శివరామకృష్ణ ఉత్తమ పంచాయతీ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. దివారం జరిగిన ఈ వేడుకల్లో కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భఘేల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ముద్దన నాగేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.


కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భఘేల్ నుంచి అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ

చంద్రబాబు దావోస్ పర్యటన అట్టర్ ప్లాప్

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనతో రాష్ట్రానికి ఒరిగిందేమీలేదని, పెట్టుబడులు తీసుకురావడంలో తీవ్రంగా విఫలం చెందారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆదివారం హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే ధ్యేయంగా కూటమి పాలకులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు విహార యాత్రకు వెళ్లినట్లు దావోస్‌కు వెళ్లారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల వ్యాపార దిగ్గజాలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారని చెప్పారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు పెట్టుబడులు వరదలాగా వచ్చాయని పేర్కొన్నారు. విజన్ సృష్టికర్తనని తనకు తానే డప్పు కొట్టుకునే చంద్రబాబు ఒక రూపాయ కూడా పెట్టుబడులు ఎందుకు తీసుకురాలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు. ఆడలేక మద్దెల దరువు అన్నట్లు దావోస్ పర్యటనతో పెట్టుబడులు ఎందుకు వస్తాయని చంద్రబాబు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో అనేక పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని, లక్షలాది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన పరిశ్రమలను చిన్నచూపు చూస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటంతో పరిశ్రమలు మూతపడే పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కూటమి పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు భృతి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరి రావు, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, నాయకులు చిమటా బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గణేష్

చేతిరాతే భవిష్యత్ నిర్ణేత


స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నుంచి బహుమతి అందుకుంటున్న జెస్సీ


జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హారిక

యద్దనపూడి: చేతిరాతే మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ముత్యాల్లాంటి అక్షరాలు మన తలరాతను మారుస్తాయని సర్వశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సూరవరపుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి నల్లమద్ది జెస్సీ 'వీర్‌గాథా 4.0' అనే అంశంపై పేరాగ్రాఫ్ రైటింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడలో సర్వశిక్ష అభియాన్ కార్యాలయం వద్ద జెస్సీకి బహుమతి అందజేశారు. జాగర్లమూడి ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలకు చెందిన టి.హారిక జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఆదివారం బాపట్లలో జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. విద్యార్థినులను ఎంఈఓలు పుల్లెల సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-2 చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయులు ఎం. శారద, పోతినేని హరిబాబు అభినందించారు.

మనోడే.. వదిలేయ్!

- ఎక్సైజ్ పోలీసుల మాయాజాలం
- అధికార పార్టీ నేతల సిపార్సు

వేటపాలెం: హలో ఎక్సైజ్ ఎస్ఐ గారూ.. పట్టుబడిన మద్యం బాటిళ్లకు సంబంధించిన వ్యక్తి మనోడే ..వాటిని వదిలేయండి ! అంటూ ఎక్సైజ్ పోలీసులకు అధికార పార్టీ ముఖ్య నేతలు తాలూకా ఫోన్లు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఆదివారం వేటపాలెం మండలం పరిధిలోని చల్లారెడ్డిపాలెంలో ఎక్సైజ్ అధికారులు ఒక ఇంటిపై దాడి చేసి 72 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. అయితే, ఇంటి యజమాని అధికార పార్టీకి చెందిన నాయకుల తాలూకు మనిషి కావడంతో వెంటనే పార్టీ ముఖ్య నేతలకు సమాచారం అందించారు. దీంతో ఎక్సైజ్ పోలీస్‌లు అక్కడ దొరికిన మద్యం బాటిళ్లల్లో 18 మాత్రమే తీసుకొని వెళ్లారు. మిగిలిన వాటిని తిరిగి వారికే అప్పగించారు. అయితే, బాటిళ్లు పట్టుబడిన ఇంటి యజమాని పేరు తొలగించి మరొకరి పేరు చేర్చినట్లు సమాచారం. ఎవరిపై కేసు నమోదు చేస్తారో వేచి చూడాల్సి ఉంది. ఎక్సైజ్ ఎస్ఐకి ఫోన్ చేసి వివరాలు అడగ్గా 18 మద్యం బాటిళ్లు మాత్రమే పట్టుబడినట్లు చెప్పారు. ఎవరి వద్ద పట్టుకున్నారనే సమాచారాన్ని మాత్రం గోప్యంగా ఉంచారు.

విను వీధుల్లో జాతీయ పతాక రెపరెపలు


జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు


రామకృష్ణ పబ్లిక్ స్కూలు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రేపల్లె రూరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రేపల్లె పట్టణంలో ప్రదర్శించిన 200 మీటర్ల జాతీయ పతాక ర్యాలీ ఆకట్టుకుంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం నుంచి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, పలు పాఠశాలల విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటరు, రింగురోడ్డు మీదగా ఓల్డ్‌టౌన్ వరకు సామూహికంగా వందేమాతరం గీతాలాపన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని చాటుతూ రామకృష్ణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైతన్య వేదిక కన్వీనర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.

రూ.7.600 కోట్ల జీఎస్టీ రెవెన్యూ లక్ష్యం

- ఇప్పటికే రూ.5,370 కోట్లు వసూలు
- లక్ష్యసాధనకు ఉద్యోగులు కృషి చేయాలి
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


కమిషనర్ సాధు నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బంది

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : జీఎస్టీ ఉద్యోగులు దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఐదు జిల్లాల(ప.గో, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సూచించారు. స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. సిబ్బంది కవాతు నిర్వహించి జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జీఎస్టీ కమిషనరేట్ పరిధిలో రూ.7600 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి రూ.5,370 కోట్ల పన్ను వసూలు చేసినట్లు వివరించారు. కమిషనరేట్ పరిధిలో పన్ను ఎగవేత రూ.345 కోట్లుగా ఉన్నట్లు గుర్తించగా, దానిలో రూ.146 కోట్లు ఇప్పటికే రాబట్టామని పేర్కొన్నారు. అదనపు ఆదాయ సేకరణ, పన్ను ఎగవేత గుర్తింపు, అక్రమ వస్తువుల స్వాధీనం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల గుంటూరులో రూ.12.39 కోట్ల విలువైన చట్ట విరుద్ధమైన సిగరెట్లు, గంజాయి, చైనీస్ వెల్లుల్లిని దహనం చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం అంకితభావంతో పనిచేసిన అధికారులకు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నల్లపాడు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జానపదం, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కాసుల కృష్ణంరాజు చేసిన మ్యాజిక్ షో, డ్రాగన్ షోలు ఉద్యోగులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

యువకుడి అనుమానాస్పద మృతి




తెనాలి రూరల్: స్థానిక యడ్ల లింగయ్య కాలనీలోని మురుగు కాల్వలో ఆదివారం ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాలనీకి చెందిన కరీం బాషా(29) అలియాస్ జండు మురుగు కాలువలో మృతి చెంది పడి ఉండటాన్ని తెల్లవారుజామున గుర్తించిన స్థానికులు మృతదేహాన్ని వెలికి తీయించారు. చిన్న మురుగు కాలువలో యువకుడు కరీం బాషా పడి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు తెనాలి త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను, స్థానికులను విచారణ చేశారు. చెంచుపేటలోని ఓ హోటల్లో మృతుడు పనిచేస్తుంటాడని అతని తల్లి, మేనమామ తెలిపారు. హోటల్ నిర్వాహకులు తరచూ తీసుకెళ్తూ ఉంటారని, శనివారం సాయంత్రం పిండి కలిపే పని ఉందని చెప్పి తీసుకువెళ్లారని వివరించారు. అయితే రాత్రి ఇంటికి రాలేదని స్నేహితుల ఇంట్లో ఉండి ఉంటాడని భావించామని చెప్పారు. అనుకోని విధంగా తెల్లారేసరికి మురుగు కాలువలో శవమై కనిపించాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై యువకుడి దాడి

పెదకూరపాడు: హెడ్ కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో ఓ యువకుడు దాడి చేసిన సంఘటన పెదకూరపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదకూరపాడులోని పాత బస్టాండ్ సెంటర్‌లో అమరావతి ఎస్ఐ రాజశేఖర్ విధుల్లో ఉండగా అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న పెదకూరపాడుకు చెందిన షేక్ రియాజ్ ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో ఆపారు. బండి కాగితాలు చూపించమని అడిగారు. రియాజ్ మద్యం మత్తులో కాగితాలు చూపించకపోవడంతో పెదకూరపాడు హెడ్ కానిస్టేబుల్ నంబూరు నాగేశ్వరరావును సదరు బైక్‌ను స్టేషన్‌లో పెట్టమని ఆదేశించి వెళ్లిపోయారు. వెంటనే నాగేశ్వరరావును రియాజ్ దుర్భాషలాడాడు. 'నా బైక్ తీసుకెళ్లే ధైర్యం ఉందా?' అంటూ ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. పక్కన ఉన్న హోంగార్డు బైక్ తాళం చెవి తీసుకోని హల్‌చల్ చేశాడు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

70శాతం డబ్లింగ్ పనులు పూర్తి

గణతంత్ర దినోత్సవంలో రైల్వే డీఆర్ఎం రామకృష్ణ


రైల్వే సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నిర్దేశిత లక్ష్యాల సాధనకు రైల్వేశాఖ సిబ్బంది కృషి చేస్తున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ చెప్పారు. నల్లపాడు రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేశారు. డివిజన్ పరిధిలోని రైల్వే పోలీసులు కవాతు నిర్వహించి జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. డీఆర్ఎం మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రైల్వే శాఖ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించినట్లు వివరించారు. సరుకు రవాణాలో ముందున్నామన్నారు. డివిజన్ పరిధిలోని సిబ్బంది జాతీయస్థాయి అవార్డులు దక్కించుకున్నారని వివరించారు. కొత్త రైల్వే లైన్లు, విద్యుదీకరణ, డబ్లింగ్ పనులను ఇప్పటికే 70 శాతం పూర్తిచేసినట్టు వెల్లడించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు విభాగాధిపతులకు ప్రశంసా పత్రాలను డీఆర్ఎం అందజేశారు.

నాట్కో ట్రస్టుకు ప్రశంసాపత్రం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రూ.50 కోట్లతో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ నిర్మాణం చేసి కార్పొరేట్ క్యాన్సర్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్న నాట్కో ట్రస్ట్‌కు అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సదాశివరావు, అశోక్‌కుమార్‌లకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్యాధికారులు, నాట్కో క్యాన్సర్ సెంటర్ సిబ్బంది, నాట్కో ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రపంచ దేశాలకు మన రాజ్యాంగం ఆదర్శం

శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ దేశాలకు మన రాజ్యాంగం ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీజీఎస్ పబ్లిషర్స్ ప్రచురించిన 'భారత రాజ్యాంగం' (సంక్షిప్తంగా) పుస్తకాన్ని శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు ఆవిష్కరించారు. అదే విధంగా 'రాజ్యాంగ నిర్మాణం-రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఫొటోలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. మోషేన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమ నిర్వాహకుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ లౌకిక వాద సంరక్షణ అందరి లక్ష్యం కావాలన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్న ప్రతిసారీ న్యాయవ్యవస్థ ప్రజల పక్షాన బలంగా పని చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కేవీఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలీస్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవీ నారాయణ, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కన్న మాస్టారు, అవధానుల హరి, ఆవాజ్ నాయకులు చిష్టి, విశ్లేషకులు బి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.